క్లుప్తంగా

ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి

రేణిగుంట: జగనన్న గృహ లబ్ధిదారులకు పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామ సచివాలయాల్లో వేగవంతం చేయాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. గతంలో జగనన్న పట్టాలు పొందిన లబ్ధిదారుల ఇంటిపట్టాలను ప్రభుత్వం సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తోందన్నారు. ఆయా సచివాలయాల్లో వలంటీర్ల సహకారంతో లబ్ధిదారుల పట్టాలను పక్కాగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని, దీన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ జగన్‌మోహన్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

విజ్ఞాన విపణిలో డార్విన్ ఓ మైలురాయి



సభలో మాట్లాడుతున్న దామోదరం

రేణిగుంట: విజ్ఞాన విపణిలో డార్విన్ సిద్ధాంతం ఓ మైలురాయి అని తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు టి.దామోదరం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం డార్విన్ 214వ జయంతి సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'జీవ పరిణామం' అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతం సైన్స్ అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిందన్నారు. క్విజ్‌లో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ కార్యదర్శి కుప్పస్వామి, క్విజ్ టీచర్ ఇమామ్, ఉపాధ్యాయులు నాగమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అలీఖాన్



అలీఖాన్

బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దార్‌గా పీఎండీ అలీఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ భార్గవి ఉమ్మడి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ అలీఖాన్‌కు డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు, సీనియర్ సహాయకులు నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చొరవ చూపుతానని ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

నారాయణవనం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు స్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు.అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు పాల్గొనాలని ఆయన కోరారు.

16న గ్రామీణ భారత్ బంద్



మాట్లాడుతున్న దాసరి జనార్దన్

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకమైన చట్టాలను తెస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత్ బంద్ చేస్తున్నట్టు చెప్పారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రమణయ్య, కత్తి ధర్మయ్య, నాగరాజు, మణి ఆచారి, పోలయ్య పాల్గొన్నారు.

16న రథసప్తమి పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16న రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వెలసిన సూర్యదేవునికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. ఆలయంలో కల్యాణ వేదిక వద్ద రథసప్తమి సందర్భంగా సూర్యనమస్కారాలు చేయనున్నట్లు తెలిపారు.



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

శ్రీకాళహస్తి: స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సోమవారం పలు భవనాలు, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. అందులో భాగంగా తొట్టంబేడు గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు. జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండుకళ్లుగా భావించి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలాధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, జెడ్పీటీసీ మునిరత్నం, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైస్ సర్పంచ్ గోపాల్, బోర్డు మెంబరు భాస్కర్, గంగాధర్, రవి, వెంకీ, ధర్మయ్య, కొన్నల ఇ రమేష్, విజయభాస్కర్, చింతా రాజేంద్ర, మాబాషా, షబ్బీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి

వైఎస్సార్‌సీపీతోనే సుపరిపాలన సాధ్యం

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా సోమవారం తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం, చర్చి కాంపౌండ్, ఎస్టీకాలనీ, జ్ఞానాంబకండ్రిగ గ్రామాల్లో ప్రతి గడపలో ఉన్న జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందిన వారితో మమేకమయ్యారు. ఆమె మాట్లాడుతూ, తాము గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజాసేవలోనే ఉన్నామన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలు సమీపిస్తుండడంతో, నాలుగేళ్లు కనిపించకుండాపోయిన టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పడానికి వస్తున్నారని వారిని నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, కొన్నలి రమేష్, వెంగళరావు, భాస్కర్‌నాయుడు, మురళినాయుడు, ముకుందనాయుడు, వాసు, మునిరాజా, రాజశేఖర్, తీర్థరామన్, లక్ష్మి, దీపక్, శేఖర్‌రెడ్డి, నాగమణి, కోవి చంద్రయ్యనాయుడు, మణినాయుడు, గంగాధర్, భాస్కర్‌రెడ్డి, నెలవల్ల ప్రసాద్, చంద్రబాబు, భక్తవత్సలం, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

సత్యవేడు: పాఠశాల విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ కే. రవి, ఎంపీడీఓ కే.చంద్రశేఖర్ ఆదేశించారు. గత వారం ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది దాసుకుప్పం ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ముద్ద అన్నం, రుచికరంగా భోజనం లేకపోవడం, విద్యార్థులు ఎక్కువ మంది ఇళ్ల నుంచి క్యారియర్లలో భోజనం తెచ్చుకొని తినడం గుర్తించారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం నిర్వహణ సక్రమంగా లేదని డీఈఓకు ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని మధ్యాహ్న భోజన కమిటీ సభ్యులు ఎంఈఓ, ఎంపీడీఓ ఎంఈఓ–2 ఉష, డీటీ రవిచంద్ర, సర్పంచ్ రవిరెడ్డి, ఎంపీటీసీ బాలయ్య కలసి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచిచూశారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం బడిలోనే తినాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యత లేకపోతే తొలగిస్తామని వంట నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏఏఎం బాలాజీ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న మండల కమిటీ సభ్యుల బృందం

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూతితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయస్వామి

సంక్షేమ రథసారథి వైఎస్ జగన్



గండరాయనిమిట్టలో కరపత్రాలు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి



పథకాల లబ్ధిని వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

- సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట
- సిద్ధం కార్యక్రమంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని మాధవమాల, ఎస్సీ కాలనీ, గండరాయనిమిట్ట, సుండికండ్రిగ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ నవరత్నాల అమలుతో పేదల కుటుంబాల్లో ఆనందం నిండిందని వెల్లడించారు. ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నేనని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేశారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు రుణమాఫీ, సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా మొత్తాలను ఎప్పటికప్పుడు బ్యాంకు ఖాతాల్లో జమచేశారని గుర్తు చేశారు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీ కండువాలు వేసుకున్న మోసగాళ్లు వస్తున్నారు.. జాగ్రత్తగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేశారు. నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ బల్కిస్ బేగం, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నీలకంఠం రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పెరుమాళ్ ఆచారి, లోకనాథ రెడ్డి, గురవారెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీమంతుల రామయ్య ఆచారి, వెంకటయ్య, సురేఖ, గురునాథం, గుణశేఖర్ నాయుడు, కుమార్, కేశవులు ఆచారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

సత్యవేడు: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేయాలని సీడీపీఓ దేవకుమారి అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కార్యాలయంలో బాల్య వివాహాల నిషేధ చట్టం–2006 పోస్టర్లను కార్యకర్తలతో కలసి సీడీపీఓ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, బాలికలు విద్యతో జీవితానికి బాటలు వేసుకుంటే బాల్యవివాహాలకు ఆస్కారం ఉండదన్నారు. పేదరికం, నిరక్షరాస్యత బాల్య వివాహాలకు కారణమవుతున్నాయన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్న పక్షంలో 1098, 100, 112, 181 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అమ్మాయిలకు18 ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు చేస్తే ఇరు ఇరుకుటుంబాలకు రూ.లక్ష జరిమానా, రెండేళ్లు జైలుశిక్ష విధిస్తారన్నారు. బాలికలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యతో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఏ.చెంచులక్ష్మి, పి.శిల్ప, కే.యమున, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సత్కారం



బదిలీపై వెళ్తున్న తహసీల్దార్, ఎస్ఐని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వరదయ్యపాళెం: తహసీల్దార్‌గా పనిచేస్తూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన గౌరిశంకరరావు, బదిలీపై వెళ్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డికి సోమవారం వీడ్కోలు సన్మానం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పలువురు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, పలువురు నాయకులు వారి సేవలను ప్రస్తుతించారు. సుదీర్ఘ కాలం పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించిన ఘనత గౌరిశంకరరావుదని ప్రశంసించారు. అలాగే మిచాంగ్ తుపాను సమయంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అలాగే మండలంలో బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఉదయ భారతి, ఎస్ఐ ప్రతాప్‌లను కూడా సత్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, డిప్యూటీ తహసీల్దార్లు శాంతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న రాధాకృష్ణ

నారాయణవనం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఇంజినీరింగ్ అధ్యాపకులకు వారం రోజుల జాతీయ స్థాయి శిక్షణ, సదస్సు సోమవారం సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. కళాశాల ఆడిటోరియంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఐ) సలహాదారు రాధాకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏఐసిటిఐ, న్యూఢిల్లీకి చెందిన ఏటిఏఎల్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం టెక్నాలజీ పరంగా ట్రెండ్‌గా మారిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అంశంపై కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు బోధించే అధ్యాపకులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఏఐ) పెనుమార్పులను తీసుకువస్తుందన్నారు. ఆధునిక ప్రమాణాలతో విద్యాబోధనకు సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్, ఐటీ ప్రొఫెసర్ రామకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ గీతావాణి, కో–కన్వీనర్లు కుమార్, సురేష్, దేశ వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు 76 మంది పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామి సేవలో జెడ్పీ చైర్మన్



ఆలయం వద్ద జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ దామోదరరాజు తదితరులు

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామిని జెడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి స్వాగతం పలికారు. ఆలయంలో వేదపండితులు రాజశేఖర దీక్షితుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. మాఘమాసం సందర్భంగా ఆలయంలో అగండ్లం ఏర్పాటు చేసేందుకు వచ్చినట్లు చైర్మన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దేవుడు, ప్రజల దీవెనలు ఉండేలా ఆశీర్వదించాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోయకొండ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహాదారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన.. ప్రత్యేక సాధన

- టెన్త్ విద్యార్థులపై టీచర్ల ఫోకస్
- ఉత్తమ ఫలితాల కోసం అదనపు తరగతులు
- మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు



ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

పూతలపట్టు: విద్యార్థి ఉజ్వల భవితకు పదో తరగతి తొలిమెట్టు. ఈ మెట్టు ఎక్కితే ఒక మైలురాయి దాటినట్టే. ఈ క్రమంలో టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అటు ఉపాధ్యాయులు, ఉత్తమ గ్రేడ్ దక్కించుకోవాలని ఇటు విద్యార్థులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకు జరగనున్నాయి. బృంద చర్చలకు ప్రాధాన్యం ఇస్తూ వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ముఖ్యంగా 10 వతరగతి విద్యార్థుల విజయానికి మూల స్తంభంగా ప్రభుత్వం నిలిచింది. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు సకల సౌకర్యాలు అందివ్వడంతో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటున్నారు. ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే 10వతరగతి పబ్లిక్ పరీక్షల్లో పూర్తిగా 100 ఉత్తీర్ణత శాతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులే సాధిస్తున్నారు.

పరీక్షలకు సన్నద్ధం

డిసెంబర్ నుంచే పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. గత నెల 23 నుంచి ఫార్మెటివ్–3 పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 23 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. మండలంలో 11 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 10 వతరగతి చదువుతున్న 441 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో బాలురు 274, బాలికలు 170 మంది ఉన్నారు. విద్యార్థులందరూ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. పబ్లిక్ పరీక్షల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. ఎలక్ట్రాన్ పరికరాలు, క్రీడలు, విహారయాత్రలు వంటి వాటికి పిల్లలను దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతో ఉంది. పాఠశాలలో మాత్రమే కాకుండా ఇంటి వద్ద కూడా విద్యార్థులను చదివించాలి. అప్పుడే పరీక్షల్లో ఉత్తీర్ణత మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

పరీక్షల సమయంలో విద్యార్థులకు సూచనలు

- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి.
- ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా అభ్యాసం చేయాలి.
- ఫిబ్రవరి చివరి నాటికి ప్రిపరేషన్, రివిజన్ రెండింటినీ పూర్తి చేసుకోవాలి.
- తొలి పరీక్షకు వారం ముందు నుంచి పూర్తిగా ఆ పరీక్ష కోసమే సమయం కేటాయించాలి.

ప్రత్యేక తరగతులు



మండలంలోని పి.కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాను. మార్చిలో పబ్లిక్ పరీక్షలు ఉండడంతో మా టీచర్లు డిసెంబర్ నుంచే మాకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఆ తరగతులు మాకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– గీతిక, 10వ తరగతి, పి.కొత్తకోట

మంచి మార్కులు సాధిస్తాం



పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వల్ల మేము పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాం. ఈ ప్రత్యేక తరగతుల వల్ల సందేహాలను అప్పటికప్పుడే టీచర్లను అడిగి సమాధానం తెలుసుకుంటున్నాం. రోజూ టెస్టులు పెట్టడంతో పబ్లిక్ పరీక్షపై ఉండే భయం తగ్గిపోతోంది. ఇప్పుడే పరీక్షల్లో ఎటువంటి ప్రశ్నలు ఇచ్చినా రాయడానికి సిద్ధంగా ఉన్నాం.

– లక్ష్మీపతి, 10వ తరగతి, పూతలపట్టు

వారిపై ఒత్తిడి లేకుండా..



పదోతరగతి విద్యార్థులకు రెండు నెలల ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలపై ఒత్తిడి లేకుండా విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేస్తున్నాం. పరీక్షల సమయంలో అవలంబించాల్సిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రవిచంద్రారెడ్డి, గణితం, పి.కొత్తకోట

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఫార్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో పునఃశ్చరణ చేయిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులు పురోగతి సాధించేలా మరింత సమయాన్ని కేటాయించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

–విశ్వనాథరెడ్డి, హెచ్‌ఎం, పూతలపట్టు

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సర్పంచ్ లలిత

ఏర్పేడు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని సర్పంచ్ లలిత అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తకమిత్ర సంస్థ ద్వారా రూ.40,132 విలువ చేసే వివిధ రకాల 835 పుస్తకాలను పాఠశాలకు వితరణ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులు పాఠశాలలోని గ్రంథాలయంలో కొంతసేపు పుస్తకాలను చదవాలని సూచించారు. ఈ ఏడాది పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతను సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.